# నా మిత్రుని జీవిత చరిత్ర

తాళ్ళూరి వెంకటరామారావు గారు

కారణాంతరముల చేత నేను రెండేండ్ల క్రితము నైజాం రాష్ట్రమున నున్న “సింగరేణి” పోవుట తటస్థించినది. అక్కడ నున్న విశేషముల జూచుచు నేనొకనాటి యుదయమప్పటికి కంపెనీవారి ఆసుపత్రి జూడంబోయితిని

అందులో రమారమి ఎనిమిది పదులమంది రోగులు గలరు. వీరందరును అక్కడి బొగ్గుగనులలో పనిచేయు కూలివాండ్రు మాత్రమే. నేను వైద్యశాలాధికారితో మాటలాడుచు వేరువేరుగా రోగుల చూచుచుంటిని ఇంతలో ప్రక్కగదిలోనుండి “దాహము — దాహము” అను దీన స్వరము వినవచ్చినది. ఆ కంఠస్వరము నాకెన్నడో పరిచితమై యున్నట్లుగ తోచినది. “ఇక్కడ యున్న నాకు పరిచితు లెవరుందురా!” అని యనుకొనుచు నేను నా యుద్యోగితో నాగదిలోనికి బోయితిని.

ఆగదియందొక చిన్నమంచము పైని కృశీభూతదేహుడగు పురుషుడొకడు శయనించియుండెను ఆతని శరీరమంతయును ధవళవస్త్రాచ్ఛాదితమై యుండెను. ముఖము గుర్తింపరానంత నీరసించియుండెను. కనులు లోతుపడి యుండెను. నోరు తెరచుకొనియుండెను. నాతో వచ్చిన యుద్యోగి యాతని కంఠమున కొంచెము చప్పనిగంజి పోసెను రెండు గుక్కలు త్రాగిన పిమ్మట నాతడు కనులు విప్పెను ఆతడు నాముఖమువంక నొక్కసారి చూచెను. ఆతని నేత్రములందొక విధమగు పరిచితభావము గోచరింప “అయ్యా! మన దేవూరు? అని ప్రశ్నించెను.”



“ఆతడు నాముఖమువంక నొక్కసారి చూచెను.”

అప్పటి కాతని నింకను పోల్చుకొనకున్నను, కంఠస్వరముమాత్రము నాకు చిరపరిచితముగనే నిశ్చయమయ్యెను నేనాతని దరిజేరి “మాది విశాఖపట్నం జిల్లాలోని నెల్లిమర్ల” అన్నాను

ఆరోగి తెల్లబోయి యశక్తుడై పడిపోయి హీనస్వరమున “నన్ను మీరెరుగుదురా?” అని యడిగెను.

నే నింకను అతనిని పోల్చుకొనలేదు అప్పు డాతడు “అయ్యో! దైవమా! పూర్వస్నేహితులకి కూడా దూరమై పోయేనా!” అని మెల్లగ ననుకొని నాదిక్కుచూచి “అప్పల

స్వామి మీ కెప్పుడైనా స్నేహితుడు కాడా? అనెను. తత్క్షణము నే నాతనిని పోల్చుకొంటిని. బాల్యమున మేమిరువురమును కలిసి మా స్వగ్రామమైన "నెల్లిమర్ల"లో ప్రారంభవిద్య నేర్చుకొంటిమి. అతని కుటుంబ మా గ్రామమున కలిగిన గృహములలో నొకటి. అట్టియాతఁ డీస్థితి కెట్లువచ్చెనా యని శంకించుచు నే నాతని మంచముపైని కూర్చొని "అప్పల స్వామీ అయ్యో! ఇదేమిటి? నువ్విక్కడి కొచ్చే వెందుకూ? ఎన్నాళ్లయిందేమిటి? అప్పుడు చిన్నప్పుడే నేను మా నాన్నతో చెన్నపట్నం పోవడంచేత మీసంగతులు తెలియనే లేదు. మొదట పోల్చుకో లేకపోయేను; క్షమించు." అన్నాను.

అప్పు డాతఁ డశ్రువుల రాల్చుచు అతి దీనమగు తన చరిత్రమును చెప్ప నారంభించెను. వైద్యశాలాధికారి యనుమతిపైని నేనచ్చటనే యుండి యంతయును వింటిని. బాల్యమున నా ప్రాణస్నేహితుడగు నాతని విషాదచరిత్రమును వినుటచేత నాహృదయము కరిగి పోయినది.

అతని జీవితచరిత్రము విశేషము లున్నను, లేకున్నను జాలిగొల్పునదై యున్నది. ప్రపంచమున నొక్కొకకుటుంబము దైవోపహతమై నశించిపోవుట మన మచ్చటచ్చట చూచుచున్నాము. అందుల కొక యుదాహరణముగ నామిత్రుని జీవితచరిత్ర ముండుటచేత, అతని నోటను విన్నది విన్నట్లుగ దానిని లిఖించి యాంధ్రలోకమున కందచేయుచున్నాను. ఈ ప్రకటన మాతని యనుమతిపైని జరిగినదే. ఇందలి గుణాగుణములను గూర్చి విమర్శింపక పాఠకులకే వదిలివేయుచున్నాను.

౧

కొంచెము గంజి త్రాగి సేదదేరి నామిత్రు డిట్లు చెప్పుట కారంభించెను.

"నా జీవితచరిత్ర చాలా విచిత్రమైనది సర్వశక్తిస్వరూపుడైన సర్వేశ్వరుని నిరాఘాట సంఘటనలకు నా జీవన మొక ఉదాహరణమై పోయింది. ఆ గర్భశ్రీమంతుల కడుపునపుట్టి, నలుగుర్లోనూ "ఔరా" అన్నట్లు తిరిగి తుదకీలాంటి అవస్థలకెట్లా వచ్చేనో నాకే ఆశ్చర్యంగా తోస్తుందంటే పైవాళ్లకెల్లాగుంటుందో ఆలోచించవలసిన విషయమే.

నా యీ ప్రస్తుతావస్థలు బుద్ధిపూర్వకంగా నేను తెచ్చిపెట్టుకో లేదని యిది చదివేవాళ్లందరికీ తెలుస్తుంది. అయితేమాత్రం ప్రపంచం అంతా ఒక్కలాగే ఉంటుందా? నామీద జాలిపడి నాస్థితిగతులకి కళ్లలో నీళ్లు పెట్టే వాళ్లు కొందరుంటారు. ఆగ్రహపడేవాళ్లు కొందరుంటారు ఎలాగైనా నా జీవితచరిత్రలో గమనించవలసిన విషయాలు చాలాఉన్నవనిన్నీ, అవినాతో నే నశించి పోవడం మంచిది కాదనిన్నీ తోచి యీ నా అవసాన దశలో నాస్నేహితుడవైన నీద్వారా యిట్లా తెలియ పరుస్తున్నాను.

"మిత్రమా! నేను నెల్లిమర్లలో పుట్టడం, అక్కడ మన యిద్దరం చదువుకోవడం నీకు తెలిసినసంగతే కదా! ఆవూళ్లో కల్లా మాకుటుంబం మిక్కిలి గౌరవం కలదన్న సంగతి నీకు వేరే నేను చెప్పనక్కరలేదు. ఇంతలో నువ్వు మీ నాన్నతో గూడా మూడో క్లాసు చదువుతున్నప్పుడే చెన్నపట్నం వెళ్లేవు. తరవాత జరిగిన సంగతులు చెప్తాను.

"మాతాత వర్తకవ్యాపారాల్లోనూ, వ్యవసాయంలోనూ చెమట ఊడ్చి కొంతడబ్బు సంపాదించి నిలవ చేసేడు. మాతండ్రి మిక్కిలి ధర్మాత్ముడని చుట్టుపక్కల పేదవాళ్లు చెప్పుకుని, అతని కడుపునపుట్టిన మాకీఅవస్థ వచ్చినందుకు నేటికీ కళ్ల నీళ్లుపెడతారు.

"ఇల్లా ఉండగా మాతాత చచ్చిపోయేడు. మాతండ్రి యింటికి పెద్దఅయేడు. మాతండ్రి బహు అమాయకుడు; మెత్తనివాడు. ఒకరికి కష్టం అంటే ఎన్నడూ ఒప్పుకునేవాడు కాడు. చేతనైన సహాయంచేసి పేదసాదల్ని ఒకకంట చూస్తూవుండేవాడు.

"అతనికి బ్రాహ్మణభక్తి హెచ్చుగా వుండేది. బ్రాహ్మడనని అతనిదగ్గిరకి వచ్చినవాడు ఎన్నడూ ఊరికేపోలేదు. ఇది కనిపెట్టి అనేకమంది బ్రాహ్మలు "మావాడికి పెళ్లిచేసుకుంటామనీ, యిల్లుకట్టుకుంటామనీ, రామమందిరాలు కట్టిస్తామనీ" చెపుతూ మాతండ్రిదగ్గర ఏదో కొంతధనం పట్టుకుపోయేవారు.

"ధర్మాత్ములకిన్నీ, అమాయకులకిన్నీ కలికాలం పనికిరాదని మన పెద్దలు ఊరికే చెప్పలేదు. మాతండ్రికి వర్తకంలోనూ, వ్యవసాయంలోనూకూడా నష్టం రావడం ప్రారంభించింది. ఒకటి రెండు సంవత్సరాల్లో మా

తాత నిలవచేసినడబ్బు ఖర్చైపోగా అప్పులుచెయ్యవలసి వచ్చింది.

"ఇదిగాక సప్తసుళ్లనిమించిన కరువు వచ్చి దేశం క్షోభించిపోయింది. క్రమక్రమంగా మాకు అప్పులు పెరిగిపోయేయి. అప్పులతోటే వడ్డీలుకూడా పాపం పెరిగినట్లు పెరిగేయి. లాభంలేకపోవడంచేత వర్తకం చాలించవలసివచ్చింది.

"క్రమంగా కుటుంబపరిస్థితులు హీనమై పోయేయి. పూర్వంలాగు ఉచ్ఛస్థితిలో జీవించడం కష్టమై పోయింది. పూర్వపురాబడి లేకపోయినా పూర్వపు ఖర్చులు తగ్గలేదు.

"అప్పులవాళ్లు తన్ను డబ్బుతెమ్మని అనరాని కఠినపుమాటలుఅంటే మాతండ్రి మెత్తనిమనస్సు యెంత బాధపడేదో ఆలోచించవలసిందే కాని చెప్పతరంకాదు.

"ఇంతలో మా అమ్మ ఒకవిషమజ్వరాన్ని బడి కాలంచేసింది. ప్రతివిషయంలోనూ తనకి ధైర్యంచెపుతూ తన దానధర్మాలకి ప్రోత్సాహమిచ్చే స్నేహితురాలు చచ్చిపోవడం మాతండ్రికి మానరానిదెబ్బ అయిపోయింది. అన్నివిచారాలూ కలిసి యేకమై తుదకి మాతండ్రినే మింగేసేయి. మాకుటుంబం మహోన్నతదశలో నుండి అధోలోకానికి పడిపోయింది.

[అనిచెప్పి నాస్నేహితుడు కండ్లయందు ప్రత్యక్షమైన నీళ్లను తుడుచుకొని ఆయాసభరమున మాటలాడలేకపోయెను. రెండుగ్రుక్కలు మంచినీళ్లు త్రాగిన పిమ్మట నాతడు మరల నేదదేరి మరల చెప్ప నారంభించెను]

౨

"మాతండ్రినాడు ప్రారంభమైన హీనదశ నా నాడు పూర్తియైనది. అతను కాలంచేసేసరికి నాకు యిరవైసంవత్సరాలు మాత్రమే. మరి రెండేళ్లకి అప్పుల వాళ్లు అంతాఏకమై, మామీద దావాలుచేసి, తక్కువధరకి మాభూముల నన్నింటినీ వేలంపాడేసుకుని పంచేసుకున్నారు.

"భూములన్నీ పోయినతర్వాత నిలవ దమ్మిడీ లేనప్పుడు జీవనమెంతకష్టమో చూడు. మా తండ్రితాతల నాటి ఆస్తికల్లా మాలోగిలి మాత్రం మిగిలింది. కొంత చరాస్తినిఅమ్మి యెలాగో కొంతకాలం గడిపేను. పూర్వం మాతో లేనిపోని సంబంధాలు కలుపుకుంటూ తిరిగేవాళ్లంతా యిప్పుడు ముఖాలు చాటుచేసుకోవడం మొదలుపెట్టేరు. మాయిల్లు యేదో దుష్టగ్రహ వీక్షణంలో వుందని అందరూ అనుకునేవారు.

"ఇంక వెయ్యిచెప్పుకోవడం యెందుకూ! మా వూళ్లో వుండడం నాకు కష్టమై పోయింది. ఉద్యోగం చేద్దామా అంటే అందుకు నాకు చదువు చాలదు. కూలిపని కా! ఆమాటఅంటేనే నాప్రాణాలుపైకిపోయేవి. అంత మహోన్నతదశ అనుభవించిన ఊళ్లోనే అట్టి హీనావస్థ అనుభవించడం యెంతకష్టమో నువ్వు ఆలోచించుకో. పువ్వులమ్మినఊళ్లోనే పుల్లలమ్మడానికి నాకు ధైర్యం లేకపోయింది. దేశాంతరానికిపోయి యెలాగో పొట్ట పోసుకోవడానికి నిశ్చయించుకొన్నాను.

"నాకు చిన్నతనంలోనే మా మేనమామ కూతురినియిచ్చి వివాహం చేసేరు. విశేషకట్నాలతో పిల్లనిస్తామని అనేకసంబంధాలు నాకువచ్చినా, మాఅమ్మ పట్టుదలమీద మాతండ్రిమా మేనమామకూతురినే చేసేడు. "తల్లీ తండ్రీ లేని పిల్లని మనం చేసుకోకపోతేయెలాగా? మాఅన్నయ్య చచ్చిపోయేటప్పుడు పిల్లని వనకి అప్పజెప్పడం మరచిపోవడమే?" అని మాఅమ్మ కళ్లనీళ్లతో భర్తతో చెప్పడం నాకు బాగా జ్ఞాపకం.

"మా మేనమామ కూతురుపేరు రమణ. తల్లిదండ్రులు చిన్నప్పుడే కాలంచెయ్యడంచేత ఆమె మాయింటనే పెరిగింది. మావివాహం అయిన అయిదేళ్లకి రమణ కాపురానికి వచ్చింది. చిన్నతనంనుంచీ ఒక కంచంలో తిని ఒకచోటనే ఆడుకునేవాళ్ళ మవడంచేత ఆమెను నేను 'రమణా' అనిపిలవడానికి అలవాటుపడ్డాను. పెళ్లి అయినతర్వాత ఆఅలవాటు తప్పించుకోలేక పోయేను.

"రమణ అతిసాధు హృదయురాలైన పిల్ల. ఆమె మాఅమ్మకి కుమార్తెలు లేనిలోటు తీర్చింది. మాఅమ్మకి ఆమె పంచప్రాణాలూను. మా యిద్దరి అనురాగమూ చూసి మాఅమ్మ అధికానందం పొందేది. కన్న ప్రేమ కంటే పెంచినప్రేమ అధికం కదా!

"రమణ కాపురానికివచ్చిన మూడేళ్ళకి మా కొక కుమారుడు గలిగేడు. మనమడు పుట్టేడుకదా అనే సంతోషంచేత భారసాలనాడు మాతండ్రి బీదలకి విరివిగా అన్నప్రదానమున్నూ, బ్రాహ్మలకి దక్షిణలున్నూ ఇచ్చి

ఊళ్లో బంధువులని అందరినీ పిలిచి విందు చేసేను. 'అమ్మా! కొడుకుని కన్నావుటే!' అని మా అమ్మ రమ ణకి అయిదుతులాలు బంగారపునాను చేయించి మెడలో పెట్టింది. ఇంక చెప్పేదేముంది? బంధువులూ, ఊళ్లో వాళ్ళూ యిచ్చిన బహుమతులతో మా పిల్లవాడి ఒళ్లు బంగారు మలామా అయిపోయింది. అయితే అన్ని రోజులూ ఒక్కలాగే వుంటాయా? ఇప్పు డారోజులు తల్చుకోవడంకంటె వేరే కష్టం నాకు లేదు."

[పొంగి పొర్లుమన్న దుఃఖమును ఆపుకొనలేక అప్పలస్వామి ఆసుదానివలె విచారించెను. యథోచిత ముగ ననునయింపుమాటలచే నేనాతని నొకింత యోదా ర్చగలిగితిని. మరికొంతసేపటి కాతడు మరల చెప్ప సాగెను.]

"ఎరిగినవాళ్లులేని దేశంపోయి అక్కడ నివ సించే ఉద్దేశం చెప్పడంతోటే రమణ తక్షణం తనసమ్మ తం తెలిపింది. ఎన్నడుగాని రమణ నామాటకి యెదురు చెప్పి యెరగదు.

"ఏదేశం పోవుదునా?" అని ఆలోచించుకుంటూ అలవాటుప్రకారం ప్రస్తుతం మావి కాకపోయినా, మా పూర్వపుభూములమీద, తలవంచుకుని ఒకనాటి సాయం త్రం తిరుగుతున్నాను. విశాలంగా కనుచూపుమేర మహా లక్ష్మి ఒలుకుతూవుండే ఆ భూములమీద యెన్నిసార్లు వ్యవసాయం చేయించే వాడిని. ఆసంగతులు తలచు కుంటూ, ఇకముందు ఆభూములని చూడ్డానికైనా నోచుకోలేనుకదా అని ఆగకుండా ఉన్నదుఃఖాన్ని దిగమింగుతూ ఒకచోట కూర్చున్నాను.

"ప్రస్తుతం ఆభూములమీదనుండే పైర్లుచూసే సరికి 'మమ్మల్ని వదలడంతోటే యీభూములకి దరిద్రం వదిలిందికద' అనుకున్నాను. ఇంతలో వెనకనించి తెల్లటిబట్టలు కట్టుకుని తలపాగాతో ఒక పొడుగుపాటి మనిషి నాదగ్గిరకొచ్చేడు. బాగా దగ్గిరకొచ్చేక చూసి కొత్తమనిషిగా తెలుసుకుని, యాథాలాభంగా 'ఏవూ రయ్యా?' అన్నాను.

'మాది రామతీర్థాలండి.'

"శ్రీరామతీర్థం మావూరిదగ్గిర వూరేగనక, ఆ వూళ్లో నేనెరగనిమనిషి యెవరూ!"అని అనుకుని మళ్లా 'మీది రామతీర్థాలేనా?' అన్నాను.

"ఈప్రశ్న నే నడగడంతోటే అతడుపైమీద తువ్వాలు నేలవేసుకుని తీరుబాటుగా పాలంగట్టుమీద కూర్చొని మాట్లాడ్డం ప్రారంభించేడు. 'అసలు మాపుట్టు క రామతీర్థాలేనండి చిన్నప్పుడు జరక్క మాతండ్రి దేశం లేచిపోయి పరమట వెళ్లిపోయేడు. రమారమి పాతికేళ్లవుతాయండి నేనూ అక్కడే వుండి పోయేను. ఓమారు మనదేశం చూద్దామని మనసేసి యిలా గొచ్చే నండి' అన్నాడు.

'అయితే మీరువన్న దేవూరు?'

'నేనున్నది సింగరేణి అనేవూరు. అబ్బో,అదెక్క డండి. మనరాజ్యంకాదు. మనలోకంకాదు. అంతా తురకలు. హైద్రాబాదు నవాబుగారండి అక్కడ రాజు.'

'అక్కడ మీ రేంచేస్తారు?'

'బొగ్గుగనిలోనండి నాపని. నాకు నెలకి యిరవై రూపాయీలు యిస్తారు. అయితే మంది రామతీర్థా లేనా అండి?'

"కాదు. కాదు మాది నెల్లిమర్ల రామస్వామి నాయుడు కొడుకుని. అప్పలస్వామి నాపేరు!

"ఓహో! అలాగా అండి. మహానుభావుడు నాయుడు ధర్మరాజండి. పాపం ఆయనకి రావగని కష్టాలు వచ్చేయని విన్నాను. ప్రభువు చచ్చిపోయేడుట గదండి పాపం!'

"అతనితో చాలాసేపు మాట్లాడి "సింగరేణి" బొగ్గుగనుల పరిస్థితులు తెలుసుకున్నాను. అక్కడికిపోతే ఒక రెరగకుండా ఉండవచ్చుకదా అనుకుని, మార్గం వగైరాలు కనుక్కుని సాయంత్రానికి యింటికి చేరు కున్నాను."

## 3

["అయితే యీ పిచ్చిగొడవతో నీకు నేను విసు గు కలిగిస్తున్నా నేమో క్షమించాలి మరి" అన్నాడు అప్పలస్వామి. ఆతని జీవితచరిత్ర నాకు విసుగొత్తించ లేదని నేను ధైర్యము చెప్పినపిమ్మట మరల నాతడు ప్రారంభించెను.]


"సరే విను, చిన్నప్పటి స్నేహితుడవు నిన్ను చూడ్డంతోటే ప్రాణాలు లేచివచ్చేయి. నాకష్టాలిని చెప్పుకుందామంటే యిదివర కెవ్వడూ మనకు కలిసిన

మిత్రుడు దొరకలేదు. ప్రియమిత్రుడివైన నీతో నా దుఃఖాలు చెప్పుకుని హాయిగా యీప్రాణాలు వది లేస్తాను."

[అప్పలస్వామి భావోద్రేకమున నైదు నిమిషములవరకును మాటలాడకుండెను. తరువాత మరల నిట్లు ప్పుపుచ్చి చెప్పదొడగెను.]

"ఆరాత్రి రమణతో నానిశ్చయాన్ని తెలియచెప్పి మాముందు కార్యక్రమాన్ని గురించి చాలాసేపు మాట్లాడుకున్నాము. తాను జన్మించిన స్థలాన్నీ, తన స్నేహితురాళ్లనీ వదలిపెట్టి దేశంకానిదేశం పోవడమూ, అందులోనూ పూర్వపుసౌన్నత్యంపోగా భుక్తికైనా లేని స్థితిలో వెళ్లడమూ తలుచుకుని రమణ ఎంతో విచారించినది. ఆమెను ఓదార్చడానికి నాకుకూడా ధైర్యం లేకపోయింది. 'ఇంటిదగ్గిర ఎన్నడూ కష్టపడి యెరగని రమణని యెన్నికష్టాలు పెట్టాలోకదా దైవమా'అని నేను మనస్సులోనే కుమిలిపోయేను. ఆరాత్రి మాకు నిద్రలేదు.

"రైలుఖర్చులకైనా చేతిలో దమ్మిడీలేదు. అందుచేత మర్నాడు మాయింటిని బేరంపెట్టి అమ్మివేసి అప్పటికి మాకావూళ్లోవున్న అప్పులు తీర్చుకోగా మిగిలిన ఏందరూపాయిలు పట్టుకుని పిల్లవాడినీ రమణనీ తీసుకుని బయలుదేరెను.




"కావిట్లో ఒకకొమ్మున పిల్లవాడూ, ఒకకొమ్మున మూటవుండగా నేను ముందు నడిచేను. ఇల్లుకదిలితే మూడువందలరూపాయిల ఖరీదుగల యెడ్లజత కట్టిన బండిమీద వెళ్లేరమణకి నెత్తిమీద బరువైనమూట యెత్తి నావెనక నడిపించి తీసుకెళ్లేను.

"మేము బయలుదేరేసరికి మలికోడి కూసింది. ఇంకా ఊళ్లో యెవ్వరూ లేవనందుకు సంతోషిస్తూ ఊరుదాటిపోయేము. అబ్బా—ఆరోజు తలుచుకుంటే యిప్పటికీ నాగుండెలు కొట్టుకుంటాయి. మైలుదూరం పోయి వెనక్కితిరిగి తండ్రితాతలనాటి గ్రామానికి కడసారి నమస్కారంచేసి గుడ్లనీళ్లు గుక్కుకుంటూ "దైవమా! యింతతెచ్చేవుగదా" అనుకుని వెళ్లిపోయేము.

"అదే నేనావూరు ఆఖరుమారు చూడ్డం. నేను యిక్కడికి వచ్చేక అనేకసార్లు నెల్లిమర్ల వెళ్లాలనే కోరిక ఉండేది కాని సాగిందికాదు. రమణ ఒక్కసారి తన బాల్యస్నేహితురాళ్లని చూడాలని కోరిందికాని ఆమె కోరిక నేను తీర్చలేకపోయేను. ఇంక యీజన్మంలో నెల్లిమర్ల చూడ్డంసున్నా! మిత్రమా! నేను చచ్చిపోతాను. ఇంక ఒకరోజుకూడా నాకు ఆయువులేదు. నాచావు సమీపించినదని నాకు బాగా తెలుసును. నేను చచ్చిపోయినతర్వాత నాయెముకలు తీసుకెళ్లి నెల్లిమర్ల మట్టిమీద పడవేయుభారము నీది. అలాగైతేగాని నా ఆత్మ శాంతించదు. స్నేహితుడికోసం యీపాటి చెయ్యవూ?"

[అప్పలస్వామి దీనదృష్టులతో నావంక చూచెను. అప్రయత్నముగ నాతని నయనముల నశ్రులు చిమ్మెను. జన్మభూమియం దాతనికిగల యభిమానమున కచ్చెరువుపడి, అట్లే చేయుదునని యాతనికి వాగ్దానమొనర్చితిని. ఆయావేగముశాంతించినపిమ్మటఅప్పలస్వామి మరల చెప్పమొదలిడెను.]

"మరిమూడురోజులకి మేము చచ్చిచెడి సింగరేణి చేరుకున్నాము. దారిలో మేమనుభవించిన కష్టాలు నేను చెప్పదలుచుకోలేదు.


"ఇంక సింగరేణిలో వ్యవహారం చూడండి. ఇల్లులేదు వాకిలిలేదు. చుట్టాలులేరు. ఎరిగినవాళ్లు లేరు. దిక్కులేని పక్షులమై, నిలవ నీడలేనివాళ్లమై మేము రైలుస్టేషనులో దిగేము. ఏమి చేయడానికీ తోచక వెర్రివాడిలాగ నిలబడేసరికి ఒక నల్లనిమనిషి యూనిఫారమ్ (Uniform)లో నా వద్దరకు వచ్చి 'ఏఊరు?' అన్నాడు.

"అడగడమే తడవుగా నేనతనితో మా ప్రస్తుత పరిస్థితులు చెప్పేను. అప్పుడతడు 'పర్వాలేదు లెండి నాదికూడా మీఊరే. చిన్నప్పుడే యిక్కడికివచ్చేనేను;

నేను బొగ్గుగనిలో పదిహేనుమంది కూలీలమీద మేస్త్రీగా వున్నాను. మిమ్మల్ని మధ్యాహ్నం దొరదగ్గిరకితీసుకెళతాను. అంతవరకూ మాయింట్లో వుండండి. లెండి లెండి. పాపం పిల్లవాడు సడగొట్టిపోయేడు.రండిరండి.' అని అతడు మామూటలలో నొక దానిని నేను వద్దంటున్నాగాని వినక పట్టుకుని ముందు నడిచేడు. అహా! దేశంగాని దేశంలో నైనా దయగలవాళ్లు వుంటారుకదా అనుకుని అతనివెనక మేమును నడిచి యింటికి చేరుకున్నాము.

"మేము పోయేసరికి, ఆతనిభార్య కాలం గడిపినదవడంచేత భర్తచెప్పినమాటలవల్ల మా సంగతి తెలుసుకుని పిల్లవాడికిన్నీ, రమణకిన్నీ ముందుభోజనం పెట్టింది. తరవాత నేను ఆయింటియజమానితో మాటలాడుతూ భోంచేసేను. ఆమాటల్లోనే నాకు గనులలో యేదైనా పని త్వరలో వేయించమని అతనితో చెప్పుకున్నాను. అతడునూ ఆమధ్యాహ్నమే నన్ను దొరదగ్గిరికి తీసుకొని వెళ్లుటకు నిశ్చయించుకున్నాడు.

"రమణ పిల్లవాడితోకూడా నేలమీదపైటచెరగు పరుచుకుని రాత్రి అల్లానిద్ర లేనందున నిద్రపోయింది.




నిద్రావస్థలో ఆ అమాయకురాలిని చూసేసరికి నా దుఃఖ మాగిందికాదు. అబ్బా! ఆదృశ్యం నేటికీనాకళ్ళకి కట్టినట్లుగా వుంటుంది.

"ఆమధ్యాహ్నం మాకు దొరగారిదర్శనం కాలేదు. ఎన్నడూ ఒకరియింట తినడానికి అలవాటుపడి వుండనివాడ నవడంచేత నేను మొగమాటపడడంచూసి ఆయింటియామె 'అయ్యో! నాయనా! అలాగమొగమాటపడితే యెలాగవుతుంది బాబూ! కొత్తగావచ్చేవు గనక మాయింటి కొచ్చేవుగాని లేకపోతే యెందుకొస్తావు! నీకు పని అయి యిల్లుదొరికేదాకా మాయింట్లోనే వుండు. దేశంగానిదేశంలో మనలో మనం కాకపోతే యెలాగ? మొగమాటపడకు నాయనా!' అని దయతో చెప్పింది. అప్పుడామె తల్లిలాగా, ఆమెభర్త తండ్రిలాగా కనబడ్డారు.

"మర్నాడు మేస్త్రీ నన్ను దొరముందుకి తీసుకెళ్లి నాగురించి చాలానరకు చెప్పేడు. దొరగారు నన్ను ఎగాదిగా బాగాచూసి రోజుకి అర్ధరూపాయి చొప్పున కూలి ఏర్పరచి ఆమేస్త్రీకిందనే వేసేరు. మే మిద్దరం సలాంచేసి యింటికొచ్చేం.

"మరి మూడురోజులకి కంపెనీవారు నాకొక చిన్న టిన్‌రేకుయిల్లు కాళీచేసియిచ్చేరు. అందులోకి మేము వెళ్లేము. పిల్లవాడిని యెత్తుకుని మా వెనక మా యింటి యజమానురాలుకూడావచ్చి మా సదుపాయాలన్నీ చూసి మరీవెళ్లింది. వాళ్లింటికి మాయిల్లు దగ్గిరే కనక రోజూ ఆమె మాయింటికొచ్చి రమణకి ధైర్యంగా మాటలుచెపుతూ వుండేది.

౪

"నాలుగైదునెలలు గడిచేయి. మొదట కష్టంగాతోచినపని నాకు క్రమంగా అలవాటైపోయింది. నెలకి వచ్చే పదిహేనురూపాయిలతోనూ రమణ క్లుప్తంగా కాలంగడపడం నేర్చుకుంది.

"కాని ప్రతిఘడియా, ప్రతిక్షణమూ నాకు మా ప్రస్తుతావస్థలు తల్చుకునేసరికి గుండె "గుభేల్" మంటూ వుండేది. పూర్వపుపరిస్థితులు తల్చుకోవడం నాకు కష్టంగానే వుండేది. కాని యేంచెయ్యగలనూ? తల్చుకోక తప్పేది కాదు.

"పనిలో వున్న నా తెలివితేటల వల్లనైతేనేమి మేస్త్రీ సిఫారసువల్లనైతేనేమి, ఒక సంవత్సరంనాటికి నాకుకూడా మేస్త్రీపని దొరికింది. దానితోపాటు ప్రస్తుతమున్న కూలివాడియిల్లు మానేసి మేస్త్రీల కోసం కట్టిన యింటొకపెద్దయింట్లోకి మార్చుకోవలసిందని కంపెనీవారు ఆర్డరు యిచ్చేరు. జీతం నెలకి యిరవైఅయిదు రూపాయిలకి హెచ్చించేరు.

"ఇలాగ మూడుసంవత్సరాలు గడిచేయి. ప్రతి రోజూ సాయంత్రమవడంతోటే గనులలో పనిచేసే కూలీలూ, మేస్త్రీలూ కలిసి జట్లుగా బయలుదేరి సారా కొట్టుమీదపడి వొళ్లు తెలియకుండా తాగడం యిక్కడ అలవాటు. ఈ రెండు రోజుల్లోనూ యీసంగతి నువ్వు కనిపెట్టేవుంటావనుకుంటాను?"

[నే నంగీకార సూచకముగ తల నూపితిని.]

"నన్నుకూడా రమ్మని అనేకమార్లు వాళ్లు బలవంతం పెట్టినా నేను వెళ్ళలేదు. నాపని అయినతర్వాత తిన్నగా యింటికి చేరుకుని రమణ కేదైనా సహాయం చెయ్యడమో, లేక ప్రస్తుత విపరీతపరిస్థితులను గురించి తలపోసుకోవడమో నాపనులు. కొన్నిరాత్రులు నాఅవస్థలు తల్చుకుంటూవుంటే నిద్రలేకుండానే గడిచిపోయేవి. ఆరాత్రులు నిజంగా నాకు యమరాత్రులే.

"పైనచెప్పిన నాలుగు సంవత్సరాలూ జరిగిన తర్వాత దైవము మమ్మల్ని యీస్థితిలోకూడా చూడలేకపోయేడు. నాకుమన్యపుజ్వరం తగిలి వరసగామూడు నెలలు బాధపడ్డాను. ఈమూడునెల్లలోనూ మాకుటుంబం పడ్డబాధలు లెక్కలేదు. సంపాదించేవాణ్ణి నేను పడిపోవడంతోనే ప్రతివిషయంలోనూ లోటు కనిపించింది. పాపం! రమణ యేంచెయ్యగలదు? ఇంతలనా జ్వరంకోసమే విచారిస్తుందా? అంతల యింట్లో లోటువాట్లే చూసుకుంటుందా?

"నాకు జ్వరప్రకోపంచేత ప్రథమకోపం హెచ్చిపోయింది. మేము నిలవచేసుకున్న డబ్బు అయిపోవడమే కాకుండా అప్పులు పెరిగిపోయేయి. ఇంక యెవ్వరూ అరువు యివ్వడం మానేసేరు. మూడునెల్లకి నాకు జ్వరం తగ్గినా మరిరెండు నెల్లదాకా పనిలోకి వెళ్లడానికి శక్తి నాకు రాలేదు.

"ఈ రెండునెల్లలోనూ కొంతకాలం కూర్చున్న చోటినుంచి కదలలేకపోయేవాడిని. జిహ్వచచ్చి అనేక వస్తువులు తినాలని బుద్ధిపుట్టేది. అవి తెమ్మని నేను రమణని బాధపెట్టేవాడిని. ఇంట్లో తిండికే అరువు పుట్టినప్పుడు నేను కోరేవన్నీ ఆమె యెలాగ తెచ్చియిస్తుందనే జ్ఞానం నాకు కొంచెమూ అప్పుడు లేకపోయింది.

"ఒకప్పుడు ఆమె యేదో వస్తువు నాకియ్యలేదని నాపక్కనున్న కర్రతో ఆమెను పశువుని బాదినట్లు బాదిన దుర్మార్గుడిని నేను. తర్వాత విచారిస్తే లాభమేముంది? వెన్నలాంటి శరీరంమీద దెబ్బలుపడి రమణ మనస్సులో యేడుస్తూ యింట్లోకి పోవడం యిప్పటికీ నాకళ్లకి కట్టినట్లుగా ఉండి దుఃఖింపచేస్తుంది."

[అని చెప్పుసరికి నామిత్రుని శరీరము దుఃఖావేశమున గడగడ వణకసాగెను. నోట మాటరాలేదు అప్పుడు నేను నాహస్తముతో నాతనిని బట్టుకొని "అప్పలస్వామీ! నువ్వు అలాగవిచారిస్తేయెలాగ? ధైర్యంతెచ్చుకోకపోతే ఈఅవస్థలో ప్రమాదంసుమా!" అని యాతని నోటిలో నిన్ని మంచినీళ్లుపోసితిని. భార్యావిషయమున తనక్రూరత్వమునకు నామిత్రుడు పడు పశ్చాత్తాపము నాహృదయమును కలచివైచినది. సేదదేరి ఆతడు మరల చెప్పసాగెను.]

"మిత్రమా! యెంతచెప్పుకున్నా యీ నాదుఃఖాలు తరగవు. నాజీవితకాలంలోకల్లా గొప్పమార్పు కలిగిన వీరోజులే. ఇంట్లో తిండిగడవడం కష్టమైపోయింది. ఒక్కొక్కప్పుడు రమణపస్తుండి పిల్లాడికి అన్నంపెట్టేది. కొసకి అలాగా గడవలేదు.

"అప్పుడేమి జరిగినది? అయ్యో! ఆమాటలు నా పాపునోటితో చెప్పగలనా? అబ్బా! చెప్పక తప్పదు. ఏరమణ—మా అమ్మ అరచేతుల్లో—అల్లారుముద్దుగా పెరిగిందో—ఏరమణ ఒక్కనాడైనా ఆవుపాలు గొలంనుంచి సరదాకైనా యింటికి తేవడానికి మాఅమ్మ ఒప్పుకునేదికాదో—ఆరమణ—చివరకి ఒక—కూలిదై—గనిలో పనిచెయ్యక తప్పిందికాదు. అయ్యో దైవమా!

[ఆవేశవశమున నామిత్రునికంఠము డగ్గుత్తిక పడియెను. ఆతనిముఖ మెర్రబడిపోయెను. ఆగాసము హెచ్చయ్యెను. అట్టిఘనసంతతిమైన యింటబుట్టి తుదకొక కూలివాడై ప్రస్తుత దీనావస్థయందున్న నా మిత్రునిస్థితి గాంచినపుడు నాకనులం గ్రస్తులు చిమ్మినవి. మరికొంతసేపటి కాతడు సేదదేరెను.]

"అబ్బ!—కోడికుయ్యకముందు లేచి, యింట్లో పనులుచేసుకుని, వంటచేసి, నాప్రథమకోపానికిఓర్చి, నాకు యిష్టమయేలాగు పాట్లుపడి పథ్యంపెట్టి, గనులలోకి పోయి సాయంత్రందాకా పనిచేసి యింటికివచ్చి, మళ్లా వండి మాకుపెట్టి తానుతిని కటికనేలమీద రమణ పడుకునేది.

"ఆమె సంపాదించినసొమ్ము తింటూ, లేనిపోని లోట్లు యెంచుతూ నీరసపుకోపాన్ని యెన్నిసార్లు రమణని దుర్మార్గుడనై కొట్టేనో నాపాపం నన్ను కట్టికుడుపుతూంది.

"అయ్యో!రమణా! నువ్వు!ఓర్పుకి భూదేవిలాంటి దానివి. నాఅపరాధాలు క్షమించి (క్షమకోర్చి) నన్ను బ్రతికించి, నిన్ను దుఃఖపెట్టినందుకు నాకింతే కావాలి అని నన్ను విడిచిపెట్టి పోయేవుకదూ? ఈక్షణంలో

ఈ దుర్మార్గుడికంటికి నీవు కనపడ్డట్టయితే నీపాదాలు తీసుకుని నెత్తిమీద పెట్టుకోనా? అయ్యో! అంత భాగ్యం కూడానా? అబ్బ-అబ్బ-ఆయాసం-అబ్బ"-

[అప్పలస్వామి అక్కడ నేనున్నమాట మరచిపోయి ప్రాణేశ్వరి యగు రమణినిగురించి వాపోవసాగెను. అది కూసుపత్రియనియు, తాను జ్వరపీడితుడనియు మరచిపోయి ఆవేశపూరితుడై యాతడు ప్రాణేశ్వరి సాన్నిధ్యము గల్పించుకొని వెర్రివాని వలె మాటలాడసాగెను. ఆతడు మంచముపైనుండి లేవబోయి పడిపోయెను. నేను తక్షణ మాతనిని నాహృదయమున కానించుకొంటిని. నాయశ్రువు లాదీనునివక్షమును తడిపివైచిన వని వేరుగ చెప్పవలయునా?]

౫

"ఇంకా యెంతకని చెప్పుకోను! నేనుచేసినవన్నీ పాపాలే. ఉదయాన్నే పక్కంపుచ్చుకుని నేను వీధి అరుగుమీద ఒక్కడినే కూర్చునేవాణ్ణి ఒక్కడినే కూర్చోవడంచేత యేమీ తోచేదికాదు. నీరసం—యింట్లో పేదరికం—రమ కూలిచెయ్యడం—అన్నీ ఒక్కమారుగా నాతలలో ప్రవేశించి గిర్రున తిప్పేసేవి. ఒక్కొక్కప్పుడు నడుచుకుని వచ్చిపోదామా' అని పించేది. నేను చచ్చిపోతే రమణకష్టాలు గట్టెక్కుతా యేమోఅనుకునేవాడిని. ఆఖరుకెరవణకష్టించికూలిచెయ్యగా సంపాదించి కళ్లతో చూడవలసివచ్చిందికదా అనుకునే వాడిని. ఒక్కడినే కూర్చుంటే యివే ఆలోచనలు బాధించేవి.

"మా యింటికి పడగజాల దూరంలో వీరయ్య అనే కూలివాడు ఉండేవాడు. వాడుకూడా జ్వరంచేత బాధపడవాడే. వాడు నాదగ్గరకివచ్చి కూర్చునేవాడు. ఒకరితో ఒకళ్లంమాటలు చెప్పుకుంటూ ఉండే వాళ్లం. వాడు వచ్చిపోవడంతోటే నా మామూలు విచారం నాకు తప్పేదికాదు.

"ఇంతలో నాకు కాస్త నడవగల దారుఢ్యం వచ్చింది. నేనూ వీరయ్యా కలిసి సాయంత్రంవేళ ఒక ఫర్లాంగుదూరం వ్యాయామంకోసం నడిచేవాళ్లం. క్రమంగా నాకు శక్తివచ్చినకొద్దీ దూరం హెచ్చించేవాళ్లం. ఒకనాడు వీరయ్య నన్ను ఊరు చివరకి తీసుకుపోయి అప్పలస్వామీ! ఏమిటో యెప్పుడూ విచారిస్తూ కూర్చుంటావు. నీవిచారం తగ్గించే మందు ఉంది సేవించకూడదూ?' అన్నాడు.

"'వీరయ్యా! నావిచారం నాతనువుతోటే కాని మానదు. ఈవిచారానికి మందూ మాకూ పనిచెయ్యవు."

"'ఆ—ఆ—అలాగెప్పుడూ అనకేం? ఈవేళ నాతోటిరా-దాని మజా చూపిస్తాను. అది సేవిస్తే నువ్విం తకాలం యింట్లో కూర్చోవా? యీపాటికే పనిలోకి పోయి ఉండేవాడివి!

"'అదేం మందు?'

"'ఏం మందు? ఒక్కడ్రాం వేస్తే యివన్నీ పరార్—'

"'ఏమో—నా కన్నడూ అలవాటు లేదు. ఈ అయిశ్వర్యానికి తోడు అది కూడానా?'

"'ఏమిటి? అయిశ్వర్యం యేమిటి ఒక్కరోజు వ్యవహారానికి. కాకపోతే నేను యిప్పిస్తానురా యీవాళ చూద్దువు గాని.'


"ఇంక నీవు నమ్ముతావో నమ్మవో కాని అది కడుపులోపడ్డ ఒక గంటకి నా కక్కడలేని ఉత్సాహం కలిగింది. ఆక్షణములో గనిలోనికిపోయి పని చేద్దామా, అన్నంతశక్తి కలిగింది. ఆరాత్రి రమణని నేను భోజనం దగ్గర దుఃఖపెట్టలేదు. అప్పటికైదవమాసం గర్భవతియైన రమ, నాకుకలిగిన అన్నహితవుచూచి ఎంతో సంతోషించింది. నాకుజ్వరంవచ్చిన నాలుగునెలలకీ ఆమె సంతోషంతో అన్నం తిన్నరోజు అదొక్కటే.

"ఆమరునాడుకూడా వీరయ్యే నాకు బలవంతం చేసి మళ్లీ ఒకడ్రాం పోయించేడు. అలాగే నాలుగైదు రోజులు వీరయ్య సొమ్ముతో తాగేను. అదేమి కాగ ణమో కాని రోజుకిరోజూ అపరిమితిమైన శక్తివచ్చి పదిహేను రోజులలో నాపనికి నేను పోయేను

"తర్వాత ఒకనాడు వీరయ్య నన్ను సారా దుకాణానికి తీసుకుపోయి "ఏమయ్యోయ్! మేస్త్రీగారిని చూశావా? కాతా పెట్టుకోసుమా!," అని దుకాణదారుడికి నన్ను అప్పజెప్పేడు. ఒక్కనాడు తాగడం మానేశానంటే ఆవేళ నిద్ర లేదు. ఉత్సాహం లేదు. శాంతం లేదు. మర్నాడు గనిలో పనిసున్నా.

"నేను పనిలో ప్రవేశించినతర్వాత వారానికోమాటు జీతం అందుకుని కొంతిసొమ్ము సారాకి యిచ్చేసి మిగిలినది రమణచేతి కిచ్చేవాణ్ణి. అంతజీతం అయితే యింటికి తెచ్చే దింత తక్కువేమని ఆమె నన్నన్నడూ అడగలేదు. జిహ్వ చచ్చి ఉండడంచేత రోజూ యేదో కొనుక్కు తింటున్నానని ఆమె అభిప్రాయం కాబోలు? ఇదివరలో అయిన అప్పులు తీరాలని ఆమె నూనకుండా

నాతోటిపాటు గనిలో పనిచేస్తూనే ఉండేది. 'ఇంకా నువ్వు పనిచెయ్యడ మెందుకు?' అని నేనంటే నవ్వుతూ 'ఇంకొక్క రెండు నెల్లుచేసి అప్పుడు మానేస్తాను' అనేది.




“ఏమయ్యోయ్! మేస్త్రీగారిని గూశావా? కాతా పెట్టాలిసుమా!”

“పాతబాకీలు అన్నీ తీరి మళ్లా సంసారం తేలింది. నేనూ రమణాకూడా పనిచేసి సంపాదించడంవల్ల నేను పైనచేస్తూ వున్న ఖర్చు అంతగా యిబ్బంది కలగచెయ్యలేదు. క్రమంగా నాకు తాగుడు మామూలుకంటే అధికమై పోయింది. మునుపు తాగినందువల్ల నాకు శరీరవిస్మృత స్మారకం తప్పడం వ్యవహారాలు లేవు. నేను తాగుతూ ఉన్నసంగతి రమణతో చెప్పడానికి భయపడేవాణ్ని.

“మునుపటిలాగ కాకుండా ఇప్పుడు నాకుస్నేహితులు హెచ్చిపోయినారు. సాయంత్రపువేళ వాళ్లూ నేనూ కలిసి సారా దుకాణానికి పోయేవాళ్లం. వాళ్లు మత్తెక్కేటట్లు తాగుతూ ఉంటే నేను ఊరుకోలేకపోయేను.

“ఒకనాడు స్మారకంతప్పి ఊరవతల పడిపోయేను. మామూలు వేళకి నేను యింటికి వెళ్లలేదు. సరిగా ఒంటిగంట రాత్రికి నాకు తెలివివచ్చి చూసుకున్నాను. ఒక్క స్నేహితుడైనా దగ్గరలేదు. నేను ఒక్కడిని రోడ్డు ఒడ్డున చీకట్లో పడివున్నాను. (కొంతసేపటికి మెల్లిగా తూలుతూ లేచి యింటికి పోయేను.

“పిల్లవాడు నిద్రపోతున్నాడు. రమణ దీపం వెలిగించుకుని దీనురాలై అక్కడ కూర్చున్నాది. నేను వెళ్లడంతోటే మన్ను అంటుకున్న బట్టలూ, యెర్రబారిన కళ్లూ, వేషమూ చూసి ఆమె నాసంగతంతా కనిపెట్టేసింది. ఆమె దీనురాలై నావంక చూసింది. ఆమాపుల ముందు నేను అణిగిపోయేను. అంతవరకూ భోంచెయ్యకుండా ఉన్న రమణా నేనూ అప్పుడు భోంచేసి నిద్రపోయేము.

## ౬

“రమణ యిప్పుడు యెనిమిదో మాసం గర్భవతి. ఆమె యింక గనిలోకిపోయి పని చెయ్యలేకపోయింది. పని చెయ్యలేక ఆమెయే మానివేసింది గాని, నా తాగుడు సాగదు కదా అని దురాగ్రహపడ్డా నేనామెను మానమని చెప్పలేదు. మిత్రమా! ఈవిషయంలో నేనెంతమాత్రమూ క్షమార్హుడిని కానుసుమా!

[నా స్నేహితుని యుచ్చైస్స్వనమున దుఃఖోద్రేకము గోచరించుచుండెను.]

“రమణ పనిమానేయడంతోటే రాబడి తగ్గిపోయింది. ఇవతల నా తాగుడు హెచ్చిపోయింది. ఆమె నాకప్పుడప్పుడు తాగుడు మానమని బోధపరుస్తూ ఉండేది. ఆమెముందర యెదురు మాట్లాడలేక సరే అని ఒప్పుకునేవాడిని. కాని బానిస నైపోయినతర్వాత మానడ మేలాగూ?

“వారం అవడంతోటే సారాకొట్టుకి మునుపటికంటె డబ్బు హెచ్చు యివ్వవలసి వచ్చేది. రోజూ ఒళ్లు తెలియక యేరోడ్డుమీదో పడిపోయి, ఏ అర్ధరాత్రికో యింటికి చేరుకునే వాణ్ని. అంతవరకూ రమణ నాకోసం అలాగే కూర్చునేది. పాపం! ఆమె కష్టం నాకేమి తెలుస్తుంది?

“ఇంటికి జీతంతెచ్చి ఒకవారం యిచ్చేను. రమణ యింటికి కావలసిన డబ్బు ఉంచి మిగిలినది నాఖర్చుకు కొంత యిచ్చింది. ఈమోస్తరుగా నాఅలవాటు క్రమంగా తగ్గించాలని ఆమె అభిప్రాయం కాబోలు! కాని ఆసొమ్ము నాకెక్కడ? రెండు రోజుల్లో సొమ్ము అయిపోయింది. సారావాడు యింక అరువు యివ్వలేదు.

“ఇంటికివచ్చి రమణని బతిమాలుకున్నాను. రేపటినుంచీ పూర్తిగా మానేస్తానన్నాను. కొసకి దయదలిచి ఆమె ఆనాటికి కొంత సొమ్మిచ్చింది. మర్నాడుకూడా యిదే రీతిగా జరిగింది.

"మూడో నాడు మరి రమణదగ్గిర సొమ్ము లేక పోయినది. నేను ఏమైనా యిమ్మని బతిమాలుకున్నాను. పాపం! దగ్గిర సొమ్ము లేందే యేమి యిస్తుంది? నా అవస్థ చూసి పొరుగింటివాళ్లని ఆమె బదులు అడుగుతే యెవ్వరూ యివ్వలేదు.

"ఆరాత్రి జరిగిన సంగతి తలుచుకుంటే యిప్పటికీ నావొళ్లు గగుర్పొడుస్తుంది. ఇంట్లోసొమ్ముండే రమణ అబద్ధమాడుతూందనుకున్నాను. కల్లెర్రచేసి సొమ్మిస్తావా, యివ్వవా? అని అడిగేను.

"నేను సరియైనస్థితిలో ఉన్నప్పుడు ఎన్నడూ రమణ నానోటినుండి అలాంటి మాటలు వినలేదు. అందుచేత ఆమె సుడిగాలి దెబ్బకి తీగెలాగ గడగడలాడి పోయింది. ఆమె నిస్తబ్ధురాలై మాట్లాడలేకపోయింది. ఆకోప తీవ్రాన్ని నాకు ముందువెనకలు తెలియలేదు. తక్షణం లేచి—చేతులో ఉన్న పేప బెత్తంతో—ఆమెను—నారమణని—అయ్యో—అయ్యో చెప్పలేను—చెప్పలేను"

[అనుచు అప్పలస్వామి దుఃఖాయాసములు ముప్పిరిగొన ఒక్కపట్టున మంచము మీదనుండి లేచి అశక్తత చేత మూర్ఛపోయెను. నేనిట్లు జరుగునని తెలియక ఆతని చరిత్రవినుటలో మునిగియున్నందున, ఆపాటును అడ్డగింపలేక పోయితిని.

పూర్ణపశ్చాత్తప్తుడగు నాతని యవస్థనుమాచి నాగుండెలు బ్రద్దలైనవి. తక్షణ మచ్చటి వైద్యశాలా పరిచారకులతో గూడ నే నాతనిని మంచముపైని బరుండబెట్టి చేతనైన యుపచారము లొనర్చితిని. దుఃఖభరమధికమై పోయినందున నాతని దేహము గడగడ వడకుచుండెను. ముక్కుపుటము లదరుచుండెను. అరగంటవరకాతనికి మాట్లాడు శక్తి కలుగలేదు.]

"రమణ నేలని పడిపోయింది. ఆమెనిండుమాలాలు ఒంటిమీద స్మారకంలేదు. అప్పుడామె మెడలో మా అమ్మపెట్టిననాను నాకళ్లబడ్డాది. ఆమె వస్తువులకల్లా మిగిలినదదిఒక్కటే వెంటనే అది తెంపేసిపట్టుకు పోయేను.

"ఆరాత్రి ఆనానుతో నేనేంచేసేనో నాకే తెలియదు. సారాదుకాణం వరకు వెళ్లి అక్కడ తాగుట మాత్రం నేనెరుగుదును. నాకు ఒంటిమీద తెలివివచ్చి చూసుకునే సరికి ఆసుపత్రిలో మంచంమీద పడివున్నాను.

"రమణనా పక్కని ఏడుస్తూకూర్చుంది. [ఇక్కడ అప్పలస్వామి ఒక్కనిముషము మాటాడక కండ్లనీళ్లు తుడుచుకొని మళ్లాప్రారంభించేడు.] శరీరం నిండా గాయాలుపడి రక్తాలు కారుతున్నాయి. డాక్టరు నాగాయాలకి కట్లుకడుతూ, నేను బాధపడుతూవుంటే 'తప్పతాగేటప్పుడు బాధలేదురా?' అని యెత్తిపొడుపుమాటలాడేవాడు. నాగాయాల బాధకంటె ఆమాటలే నన్ను హెచ్చుగా బాధించేయని మీకు వేరే చెప్పాలా?

"ఆమాటలు నాకంటె రమణనే యెక్కువగా బాధించేయని నాఅభిప్రాయం. డాక్టరు అలాంటి మాటలాడేటప్పుడూ, నేను బాధకోర్వలేక 'అమ్మో,' అన్నప్పుడూ ఆమెముఖం చాటుచేసుకుని పైటకొంగుతో కళ్లనీళ్లు ఒత్తుకుంటూ ఉండేది. నాకు మాట్లాడ్డానికి శక్తిలేకపోయింది.

"మూడురోజులు క్రిందట నేను రమణయెడల చేసిననేరం అప్పుడు జ్ఞప్తికొచ్చింది. డాక్టరు వెళ్లేడు. రమణ నాముఖంవేపు దీనంగా చూస్తూంది. నేను దాహానికని సంజ్ఞచేసేను. ఆమెయిన్ని నీళ్లునా నోట్లోపోసింది. ఆమెను నాప్రక్కలో కూర్చోమన్నాను. ఆమెమెడ మీద పేపబెత్తపు తట్లు ఇంకా స్పష్టంగా ఉన్నాయి.

"ఆమె చెయ్యి నా రెండుచేతులతోటీ పట్టుకుని నాగుండెలు మీద వేసుకున్నాను ప్రయత్నంతో రమణా!" అని పిలిచేను. కన్నీళ్లలోనుండి ఆమె నన్ను చూసింది. 'క్షమించవూ!' అన్నాను. ఆమెముఖం పక్కకి తిప్పి ఎడతెగకుండా వస్తూన్న కన్నీటిని ఒత్తుకుంది.

"ఇంక వెయ్యి చెప్పడం యెందుకూ? నెలరోజులు నే నాసుపత్రిలో వున్నాను. పండుకున్నప్పుడు తప్ప ప్రతి ఘడియారమణ నా ఉపచారాల్లో ఉండేది. ఆమె అమృతహస్త ప్రభావంవల్ల నే నాగాయాలు మాని నేను బతికేనుగాని మందులవల్ల కాదని నేను స్పష్టంగా చెప్పగలను.

"మిత్రమా! ఇక్కడ ఒక విచారకరమైనసంగతి చెప్పవలసి వస్తూంది. అల్లాటి సంగతులు చెప్పడానికి నన్ను ఏట్లో మొరదులాగ భగవంతుడు బతికించేడు. నేను ఆసుపత్రిలో ఉండడం, రమణ పని చెయ్యలేనిస్థితిలో ఉండడం నీకు చెప్పేను కదా! ఈ రోజుల్లో మాకు జీవనం యెలాగ గడిచిందనుకున్నావు. అప్పుడే మాకుర్రవాడు పన్నెండేళ్లవాడు గనిలో పని చేసి మమ్మల్ని పోషించి తల్లి దండ్రుల ఋణం తీర్చుకున్నాడు.

"నెలరోజులూ ఆయిన తర్వాత నేను యింటికి వెళ్లవచ్చునని డాక్టరు చెప్పినాడు. నేను యింటికి పోయిన నాలుగురోజులలో వయస్సుకి తగనిపనిచేతను, పనికి తగిన తిండిలేకపోవుటచేతనూ, మాపిల్లవాడికి జ్వరంతగిలింది. పదిరోజుల దాకా బాధపడి, వాడు యిహలోకాన మాబుణం తీర్చేసి పరలోకానికి పోయేడు. ఇలాగ్గా నాతాగుడు ఘాతానికి నాకడుపున బుట్టిన బిడ్డని కూడా అర్పించేసి మొండి వాణ్ణై బతికి ఉన్నాను.

[గర్భశోకము అప్పలస్వామికి దుర్భరమైపోయెను. ఆతడు నాతో మాటలు మాని స్త్రీవలె నాపోవసాగెను. అప్పుడా విషాదహృదయుండగు జనకుని నోదార్చుటకు నాకు సాహసము లేకపోయినది మరి అయిదు నిమిషములకు కొంతశోక ముపశాంతి నొసుకొని యాతడు చెప్పుట మరల మొదలుపెట్టెను. విచిత్ర దైవసంఘటనల కాశ్చర్యపడుచు, నా మిత్రుని దుఃఖభాజన మగు చరిత్రమును వినుచుంటిని.]

"పుత్రశోకంచేత రమణ మరి యెత్తిర లేదు. నేనెన్నివిధాల ధైర్యంచెప్పినా ఆమె వినలేదు. ఆమె యిహలోక సౌఖ్యాలే మానేసింది. నేను పూర్వపు గుర్గుణాలు మానేసే నన్న సంతోషం ఆమెకి లేకపోయింది.

"ఆనెలలో మరి పదిరోజులకి రమణకు ప్రసవ వేదన లారంభమైనవి. మూడు దినాలవరకూ రమణకి నిద్రాహారాలు లేవు. అపరిమితమైన ప్రసవవేదనలామె ఆరోజుల్లో అనుభవించింది. మొదటమమ్మల్ని ఆపుళ్లో ఆదరించిన మేస్త్రీ చనిపోవడంతోటే ఆతనిభార్య పుట్టింటికి పోయింది. అందుచేత ఒకరి సహాయంకూడా మాకప్పుడు లేదు.

"మూడో నాటిరాత్రి రెండు జాములైంది. పట్నం అంతామాటు మణిగిపోయింది. దూరాన్ని ఎక్కడో కుక్కల అరుపులు తప్ప ఆ నిశ్శబ్దాని కింకే అంతరాయం లేదు. కన్ను పొడుచుకుంటే కానరాకుండా చీకట్లు నిండిపోయేయి. రమణ యింట్లో గదిలో బాధపడుతూంది. నేను దైవప్రార్థన చేసుకుంటూ గది యివతల కూర్చున్నాను. మినుకు మినుకుమంటూ ఒక దీపము నా కునుకుపాట్లకి తోడైనది.

"అరగంట సేపల్లా జరిగింది. నేనక్కడ గోడకి చేరబడి మూడురోజులనుంచీ నిద్రలేనందుచేత నిద్రపోయేను. ఇంతలోనే "అమ్మో" అనే ఆర్తనాదం ఆ గంభీర నిశ్శబ్దాన్ని చీల్చుకుని వచ్చింది.

"నేను ఉలికిపడి లేచేను. ఇంక ఆలోచిస్తే లాభమేముందీ? నేను ధైర్యం మాపుకోలేకపోయేను. వెనకా ముందూ చూడకుండా గదిలోకి పరుగెత్తేను.



"నారమణ నేలని పడిపోయివుంది. ప్రాణాలు లేని శిశువొకటి ఆపక్కనే పడివుంది. "రమణా" అని పిల్చేను. చలనంలేదు. గుండెలు జారిపోయి మళ్లా "రమణా" అన్నాను. కళ్లు మెల్లిగా విడ్డాయి. ఆమె మాట్లాడ్డానికి ప్రయత్నించింది. శక్యం కాలేదు. మళ్లా కళ్లు మూతలు పడిపోయేయి.

"'రమణా!' అని మళ్లా పిల్చేను. చలనంలేదు. జవాబులేదు. ఇంక ఆగలేక ఆమెను ముట్టుకున్నాను. శరీరం చలవబారిపోయి మంచుగడ్డలాగుంది. 'రమణా! పలకవూ?' జవాబు లేదు. కదిపి ఒత్తిగిల్లించేను. శరీరం కొయ్యబారిపోయింది. ఇంకేముంది? నారమణ నన్ను ఒదిలిపెట్టేసింది దుఃఖపూరితమైన యిహలోకమిూద. ఆమె కళ్లు శాశ్వతంగా మూతలు పడిపోయేయి. నాతల తిరిగిపోయింది. కళ్లు చీకట్లు కమ్మేయి."

[క్రమంగా అప్పలస్వామికి ఆవేశం హెచ్చిపోవుచుండెను. అతనిని నేను జాగ్రత్తగా పట్టుకున్నాను. కాని నాకు దుఃఖ మాగలేదు. మహాసతిసీత, సావిత్రి, అరుంధతులను బోలు నా పతివ్రత మరణాము వినుటతోడనే నేను నిలువున నీరైపోయితిని. అప్పలస్వామి

మాట చెప్పవలెనా? అతడు దుఃఖోద్రేకమున సొమ్మసిలి తెప్పిరిలి మరల ప్రారంభించెను.]

## ౨

"మరిరెండురోజులకి నాకు ఆసుపత్రిలో తెలివి వచ్చింది. మిత్రమా! ఇంకా చెప్పుకోవడం యెందుకూ? బ్రతుకు వెలితై పోయింది. మునపటిలాగ నాకు మంచి నీళ్లు యివ్వడానికి రమణ నాప్రక్కని లేదు. దాహంతో దీనుడినై అరిచేను. నా అరుపులు యెవరికైనా వినబడ్డాయో లేదో నేను చెప్పలేను.

"రమణా! ఎక్కడున్నావు? నీవంటి విలువగల వస్తువుని వాడుకోవడ మెరగని నాఅంటివాడికి నీవు దక్కుతావా? నీశరీరం, నీప్రాణాలు సమస్తం నాతాగుడుభూతానికి అప్పజెప్పేశావా? అయ్యో! "పదేళ్లపిల్లవాడినే నీతాగుడు మహాగ్నిలో దగ్ధంచేస్తేనే నేపాపి?" అంటున్నావా?"

"మహాపరాధిని; క్షమించు. నీపాదాలుపట్టడానికైనా నేను అర్హుణ్ణికాను. నిన్నుకొట్టినదెబ్బలు— యిప్పుడు— పదిరెట్లు— తీవ్రంగా— నాకు తగులుతున్నాయి. అబ్బా—దాహం—దాహం—దాహం."

[చప్పున నేనులేచి ఆతనినోట నిన్ని నీళ్లుపోసితిని. వెర్రివానివలె నాతడు నావంక కొంతసేపు చూచి యిట్లనెను.]

"విన్నావా నాకథ అంతానూ? బాల్యస్నేహితుడవైన నిన్నుచూచి నాప్రాణాలు లేచొచ్చాయి. నీతో నాకష్టసుఖాలు మాట్లాడ్డంవల్ల నాగుండెల్లో బరువు తీరింది. నేనింక ఈవూళ్లో వుండలేను. వెళ్లిపన్ల నన్ను తీసుకుపోతే సుఖంగా చచ్చిపోతాను."

[మరినాలుగురోజులలో నేనున్నూ, అప్పలస్వామిన్నీ వెళ్లిపన్లకు బయలుదేరేము. నే నతని నక్కడ విడిచిపెట్టినపిమ్మట నాలుగైదునెల్లకు, అర్ధరాత్రివేళ అతడెవ్వరితో చెప్పకుండా పారిపోయినట్లున్నూ, మరిమూండురోజుల కాతనిశవము ఏటిలో ఒకవంపుగులో దొరికినట్లున్నూ నాకు వర్తమానమువచ్చినది.

ఇంకొకపర్యాయము నేను సింగరేణివళ్లినప్పుడు ఒకవిశేషం చూచితిని. అక్కడ తూర్పుకూలీలందరూ కలసి రమణ మహాపతివ్రతయని గ్రహించిరి. వారు చందావేసుకుని రమణపేరిట నొకమంటపము గట్టిరి. "పేరంటాలగుడి" అని దాని నిప్పటికిని వాడుచుందురు. ప్రతిమంగళవారమునూ ఊరిలో కొందరిప్పటికినీ పసపుకుంకుమలు రమణ కర్పించి భక్తితో నమస్కారము లొనర్చుచుందురు.]

సంపూర్ణము

## వేదఱిమి

భుక్తి లభియింప కెన్నియో బ్రొద్దులు సన
నిద్రగాంచక యెన్నియో నిశలు గడచె
హాయి మదిఁ జోటు గానక మాయమయ్యె
కటకటా, యింక నేటి కీకటికి బ్రదుకు.

—నిఱుపేద.